# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 06 మే 2025 | www.balagamtv.com | పేజీలు 4


## ప్రపంచంలో 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

- అగ్రస్థానాల్లో అమెరికా, చైనా..

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ప్రపంచ ఆర్థిక శక్తిగా భారత్ వేగంగా ఎదుగుతోంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) విడుదల చేసిన తాజా 'ప్రపంచ ఆర్థిక నివేదిక – ఏప్రిల్ 2025' ప్రకారం, భారత్ ఈ ఏడాది (2025) జపాన్‌ను వెనక్కి నెట్టి ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుంది. ఈ కీలక పరిణామం భారత ఆర్థిక ప్రస్థానంలో మరో మైలురాయిగా నిలవనుంది. ఐఎంఎఫ్ నివేదిక ప్రకారం, 2025 ఆర్థిక సంవత్సరానికి భారత నామమాత్ర జీడీపీ4,187.017 బిలియన్ డాలర్లకు (సుమారు రూ. 348 లక్షల కోట్లు) చేరుతుందని అంచనా. ఇదే కాలంలో జపాన్ జీడీపీ 4,186.431 బిలియన్ డాలర్లుగా (సుమారు రూ. 347.9 లక్షల కోట్లు) ఉండొచ్చని పేర్కొంది. ఈ స్వల్ప తేడాతో భారత్, జపాన్‌ను అధిగమించి నాలుగో స్థానానికి ఎగబాకనుంది. ప్రస్తుతం (2024 వరకు) భారత్ ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. భారత్ ప్రస్థానం ఇక్కడితో ఆగదని, రానున్న సంవత్సరాల్లో జర్మనీని కూడా అధిగమించి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా అవతరిస్తుందని ఐఎంఎఫ్ అంచనా వేసింది.

# సమరం కాదు సమయస్ఫూర్తి కావాలి



- ఆదాయానికి మించి ఏం చేయలేను
- మనమంతా కలిస్తేనే ప్రభుత్వం
- సమస్యలుంటే కూర్చుని చర్చించుకుందాం
- ధర్నాలు, దీక్షలు, సమ్మెలు చేస్తే ప్రభుత్వం కూలిపోతుంది
- రాష్ట్రానికి 18,500 కోట్లకంటే ఎక్కువ ఆదాయం లేదు.
- ఖర్చులు మాత్రం 22,500 కోట్లు కావాలి
- ఉద్యోగ సంఘాలనుద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు
- 'తెలంగాణ పోలీస్ రియల్ హీరోస్-2025' అవార్డులందజేత

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నదని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల తనను కోసినా ఆదాయానికి మించి ఏమీ చేయలేనని ఆయన వ్యాఖ్యానించారు. పదేండ్లపాటు రాష్ట్రాన్ని ఆర్థికంగా విధ్వంసం చేసిన వ్యక్తి ఇప్పుడు ఫామ్‌హౌస్‌లో హాయిగా పడుకున్నారని మాజీ సీఎం కేసీఆర్‌నుద్దేశించి విమర్శలు గుప్పించారు. ఇలాంటి క్లిష్ట సమయంలో ప్రభుత్వానికి సహకరించాల్సిన ఉద్యోగ సంఘాలు.. ఇక సమరమే అంటూ హెచ్చరిం చటం సరికాదని అన్నారు. 'వారి సమరం ఎవరిపై? తెలంగాణ ప్రజలపైనా వారి యుద్ధం...?' అని సీఎం ప్రశ్నించారు. సోమవారం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఓ మీడియా సంస్థ నిర్వహించిన 'తెలంగాణ పోలీస్ రియల్ హీరోస్–2025' అవార్డుల ప్రదానోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకటో తారీఖున్నే జీతాలు ఇస్తున్నందుకు సమరానికి కాలు దువ్వుతున్నారా? అని ప్రశ్నించారు. జీతభత్యాల కోసం ప్రతీనెలా రూ.ఏడు వేల కోట్లు చెల్లిస్తున్నామని తెలిపారు. గత పాలకులు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కింద ఇవ్వాల్సిన రూ.8,500 కోట్లను బకాయి పెట్టి వెళ్లారని వాపోయారు. ఆ విధంగా బకాయి పెట్టిన పార్టీలే, ఇప్పుడు తమ ప్రభుత్వంపై ఆరోపణలు గుప్పిస్తున్నాయని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం పదహారు నెలల కాలంలో రూ.30 వేల కోట్లను రైతుల ఖాతాలకు బదిలీ చేశామని సీఎం గుర్తు చేశారు. కానీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉచిత విద్యుత్ అని చెప్పి... ఆ శాఖకు చెల్లించాల్సిన బకాయిలను పెండింగ్‌లో పెట్టి పోయిందని తెలిపారు. విద్యుదుత్పత్తి కోసం బొగ్గును కొనుగోలు చేసి, సింగరేణికి డబ్బులివ్వకుండా ఎగ్గొట్టారని దుయ్యబట్టారు. ప్రాజెక్టులు కట్టామని చెబుతున్న వారు... కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా మొండిచేయి చూపారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలో 11 శాతం వడ్డీకి అప్పులు తెచ్చారు.. ఇంతకంటే దుర్మార్గం ఇంకోటి ఉంటుందా? అని ప్రశ్నించారు. ఇలాంటి వాస్తవాలన్నింటినీ పరిగణనలోకి తీసుకోవాలని ఉద్యోగ సంఘాలకు సీఎం సూచించారు. 'సమస్యలేమైనా ఉంటే పరిష్కరించుకుందాం, కూర్చుని మాట్లాడుకుందాం...' అని విజ్ఞప్తి చేశారు.

తెలంగాణలో శాంతి భద్రతలు మెరుగ్గా ఉన్నందునే ప్రపంచ స్థాయి పెట్టుబడులను ఆకర్షించగలుగుతున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఏ దేశం, రాష్ట్రంలో శాంతి భద్రతలు బాగుంటాయో ఆ ప్రాంతాలు అభివృద్ధి పథంవైపు నడుస్తాయని, తెలంగాణ ప్రశాంతంగా ఉండటానికి పోలీసు శాఖ

మిగితా 2వ పేజీలో



తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాటూరి గిరిజా ప్రియదర్శిని భౌతిక కాయానికి ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో జస్టిస్ ప్రియదర్శిని భౌతిక కాయానికి పుష్పాంజలి ఘటించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# రాష్ట్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం




- రాష్ట్రం సహకరిస్తే నీటి సరస్సులు అభివృద్ధి చేస్తాం
- హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారిని విస్తరిస్తాం
- ఆ హైవేను 4 లేన్లుగా మార్చుతాం
- కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ
- మంచిర్యాల-వాంకిడి జాతీయ రహదారి 363, సంగారెడ్డి బీహెచ్ఈఎల్‌ఫ్లైఓవర్, అంబర్‌పేట ఫ్లైఓవర్ ప్రారంభం

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర రవాణా మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తే నీటి సరస్సులు గుర్తించి వాటి అభివృద్ధికి పాటుపడతామని, తద్వారా అభివృద్ధి ముందుకెళుందని అన్నారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా సోమవారం ఆయన మంచిర్యాల, సంగారెడ్డి, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో జాతీయ రహదారి, ఫ్లైఓవర్, కన్హా శాంతి వనంలోలో బయోచార్ సెంటర్, అంబర్‌పేట వంతెనను ప్రారంభించారు. ముందుగా రూ.3,900 కోట్లతో మంచిర్యాల నుంచి వాంకిడి వరకు నిర్మించిన జాతీయ రహదారి 363ని కేంద్ర, రాష్ట్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్కతో కలిసి నితిన్‌గడ్కరీ ప్రారంభించారు. అలాగే అంబర్‌పేట ఫ్లైఓవర్‌ను ప్రారంభించారు. కుమురంభీం–ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ క్రాస్ రోడ్డులో బహిరంగ సభలో , అంబర్‌పేటలో ఆయన ప్రసంగించారు.

అందరికీ నమస్కారం, బాగున్నారా..? అంటూ తెలుగులో మాట్లాడడం మొదలు పెట్టిన ఆయన అనేక అభివృద్ధి అంశాలపై స్పందించారు. హైదరాబాద్– శ్రీశైలం జాతీయ రహదారిని విస్తరిస్తామని.. ఆ హైవేను 4 లేన్లుగా మార్చుతామని అన్నారు. ఎ తెలంగాణలో హైవేలను వేగంగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. సర్వీసు రోడ్లు, ఫుట్ పాత్‌లు కూడా నిర్మిస్తున్నామని చెప్పారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులు సరిగా సాగడంలేదని గడ్కరీ పేర్కొన్నారు. ఈ పనుల్లో తలెత్తిన సమస్యకు పరిష్కారం కనుగొన్నామని, వేగంగా పూర్తి చేయడంకోసం కొత్త కాంట్రాక్టర్‌ను నియమించామని తెలిపారు. వచ్చే పది నెలల్లో ఫ్లై ఓవర్‌ను పూర్తి చేస్తామన్నారు. రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ భూసేకరణ వేగంగా పూర్తి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.


హైదరాబాద్–విజయవాడ 4 లేన్ రోడ్డు ని 6 లేన్ రోడ్డుగా మారుస్తామని చెప్పారు. నాగ్‌పూర్‌లో అందుబాటులోకి తీసుకువచ్చిన డబుల్ డెక్కర్ ఎయిర్ బస్ ను హైదరాబాద్ రింగ్ రోడ్డుపై ట్రై చేయాలని రాష్ట్ర మంత్రులను కోరారు. ఈ బస్సులో ఎయిర్ హొస్టెస్ లాగా బస్ హొస్టెస్ కూడా ఉంటారని, సాధారణ బస్సుల కంటే 3 శాతం ఛార్జీ తక్కువగా ఉంటుందని తెలిపారు. , ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని.. డీజిల్, పెట్రోల్ వాహనాలపై ఆధారం తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రైతులు వ్యవసాయంలో కూడా పర్యావరణహిత వాహనాలు ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు. ఒక్క స్మార్ట్ నగరాలతో దేశ అభివృద్ధి సాధ్యం కాదని, స్మార్ట్ గ్రామాలు అవసరం అని గడ్కరీ తెలిపారు. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

మోడీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల అభివృద్ధి చెందుతున్నదని తెలిపారు. నీళ్లు విద్యుత్ రవాణా కమ్యూనికేషన్ ఈ నాలుగు రంగాల అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందుతుందని.. వీటి అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పని చేస్తున్నదని చెప్పారు. హైదరాబాద్ నాలెడ్జ్ సిటీ అని హైదరాబాద్ అభివృద్ధికి అన్ని రకాలుగా తోడ్పడతామని తెలిపారు. తెలంగాణలో నూతన జాతీయ రహదారులను నిర్మాణం చేస్తున్నట్టు చెప్పారు. ఉప్పల్ ఫ్లై ఓవర్ ను వచ్చే ఎనిమిది నుంచి పది నెలలు పూర్తి చేస్తామన్నారు. రోడ్ల నిర్మాణం కోసం పెండింగ్ లో ఉన్న భూసేకరణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు.ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ ఫ్లైఓవర్ పనులు వేగంగా చేసేలా కో- కాంట్రాక్టర్‌ను మార్చామని, పది నెలల్లో ఉప్పల్ ఫ్లైఓవర్ పూర్తి చేస్తామని చెప్పారు.

**రాష్ట్ర మంత్రులు ఆ ఆరు ప్రాంతాల్లో భూసేకరణ పూర్తి చేయాలి : కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

నితిన్ గడ్కరీ కృషి వల్ల ఏ గ్రామానికి వెళ్లినా జాతీయ రహదారులు కనిపిస్తున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఫలితంగా రోడ్డు ప్రమాదాలు, మరణాలు తగ్గాయన్నారు. ఆయన మాట్లాడుతూ "అమెరికాను తలదన్నేలా భారత్‌లో జాతీయ రహదారులు ఉన్నాయి. నితిన్ గడ్కరీ దగ్గరకు ఏ పార్టీ ఎంపీ వెళ్లి అడిగినా కాదనకుండా ఇస్తారు. ఆయన్ను ఫ్లై ఓవర్ల మంత్రి అని కూడా పిలుస్తుంటారు. అంబర్ పేట ఫ్లైఓవర్ ప్రారంభించు కున్నప్పటికీ సర్వీస్ రోడ్డు అసంపూర్తిగానే ఉంది. ఆరు ప్రాంతాల్లో భూసేకరణ పూర్తి కాకపోవడంతో సర్వీస్ రోడ్డు పూర్తి కాలేదు. రాష్ట్ర మంత్రులు

మిగితా 2వ పేజీలో



## తెలంగాణలో భూప్రకంపనలు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల వ్యాప్తంగా సోమవారం సాయంత్రం ఒక్కసారిగా భూమి కంపించింది. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల సహా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో స్వల్పంగా భూప్రకంపనలు వచ్చాయి. కరీంనగర్ జిల్లా కేంద్రంలో చైతన్యపురి, కిసాన్ నగర్, విద్యారణ్యపురి, కమాన్ ఏరియాలతో పాటు ఇతర ప్రాంతాల్లో 2–5 సెకన్లపాటు భూమి కంపించింది. నిర్మల్ జిల్లాలో ఖానాపూర్, కడెం, జన్నారంలోనూ ప్రకంపనలు నమోదయ్యాయి. ఇండ్లలో ఫర్నీచర్, వస్తువులు కదలడంతో ప్రజలు భయాందోళనకు గురై బయటకు పరుగులు తీశారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని తిమ్మాపూర్, రాంపూర్, తపాలాపూర్, జన్నారం, బంగారుతండా, కలమడుగు, బాదంపల్లి తదితర గ్రామాల్లో సోమవారం సాయంత్రం 6:53 నిమిషాలకు స్వల్పంగా భూమి కంపించింది. దాదాపు 10 నుంచి 20 సెకండ్లపాటు కంపించినట్టు ప్రజలు తెలిపారు. ప్రజలెవరూ ఆందోళన చెందొద్దని, అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని విద్యానగర్, శ్రీరామ్‌నగర్, బస్టాండ్, జెకె నగర్, పద్మావతి నగర్, మస్కాపూర్ గ్రామంలోని మధురనగర్ ఆయా కాలనీలో పది సెకండ్ల పాటు భూమి కంపించిందని స్థానికులు తెలిపారు. భూ ప్రకంపనలతో అక్కడి ప్రజలు ఇండ్లల్లో నుంచి బయటకు వచ్చారు.

ఏప్రిల్ 10, 2025న 'ఎర్త్‌క్వేక్ రీసెర్చ్ అండ్ అనాలసిస్' సంస్థ రాష్ట్రంలో, ముఖ్యంగా పెద్దపల్లి జిల్లా రామగుండం సమీపంలో భూకంపం సంభవించే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ ప్రకంపనలు హైదరాబాద్, వరంగల్, ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాల్లో కూడా సంభవించొచ్చని పేర్కొంది. ఈ క్రమంలో ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో స్వల్ప తీవ్రతతో భూకంపం నమోదైంది. అయితే, ఈ హెచ్చరికలను అధికారిక శాస్త్రీయ సంస్థలు ధృవీకరించలేదు. తెలంగాణ భూకంప తీవ్రతలో తక్కువ రిస్క్ ఉన్న జోన్–2లో ఉన్నప్పటికీ, గోదావరి పరివాహక ప్రాంతంలోని ఫాల్ట్ జోన్ కారణంగా అప్పుడప్పుడూ స్వల్ప ప్రకంపనలు సంభవిస్తుంటాయి.త

## సింహాచలం ఘటనలో ఏడుగురు అధికారులపై వేటు

### కాంట్రాక్టర్ ను బ్లాక్ లిస్ట్ లో పెట్టాలని ఆదేశం

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ప్రముఖ పుణ్యక్షేత్రమైన సింహాచలం వరాహ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఇటీవల గోడ కూలిన ఘటనపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించింది. ఈ దుర్ఘటనపై విచారణ జరిపిన త్రిసభ్య కమిటీ సమర్పించిన నివేదిక ఆధారంగా, నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తేలిన ఏడుగురు అధికారులను సస్పెండ్ చేసింది. అదే సమయంలో, నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ ను బ్లాక్‌లిస్టులో పెట్టడంతో పాటు, అతనిపై, మరో ఇద్దరు అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు

మిగితా 2వ పేజీలో

# వీడియో కాల్ ద్వారా వైద్యం

- గర్భిణి కడుపులోని ఇద్దరు కవలలు మృతి
- ఆస్పత్రి ఎదుట కుటుంబీకుల ఆందోళన
- ఆస్పత్రిని సీజ్ చేసిన డీఎంహెచ్‌ఓ
- రంగారెడ్డి జిల్లాలో ఘటన

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం విజయలక్ష్మీ హాస్పిటల్‌లో దారుణం చోటుచేసుకుంది. వైద్యం వికటించి కడుపులోనే కవలలు మృతి చెందారు. వైద్యుల నిర్లక్ష్యం వలనే కవలలు మృతి చెందారని ఆరోపిస్తూ ఆస్పత్రి ఎదుట బంధువులు ఆందోళనకు దిగారు. జిల్లా వైద్యాధికారి ఆస్పత్రిని సందర్శించారు. అందులో ఉన్న రోగులను ఇతర ఆస్పత్రులకు తరలించి, ఆస్పత్రిని సీజ్ చేశారు. డాక్టర్‌ను ఇబ్రహీంపట్నం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం మండలం వెలిమినేడు గ్రామానికి చెందిన బుట్టి కీర్తి 5 నెలల గర్భిణి. ఏడేండ్ల తరువాత గర్భం దాల్చింది. ప్రతి నెలా ఇబ్రహీంపట్నంలోని విజయలక్ష్మి ఆస్పత్రిలోనే వైద్యం తీసుకుంటుంది. కాగా, ఆమెకు ఆదివారం తీవ్ర కడుపునొప్పి రావడంతో ఉదయం 6.30 గంటలకు ఆస్పత్రికి తీసుకొచ్చారు. కీర్తి కుటుంబ సభ్యులు డాక్టర్ అనూషారెడ్డికి ఆమె పరిస్థితిని ఫోన్‌లో వివరించారు. కానీ డాక్టర్ 11 గంటలకు వచ్చారు. అప్పటికే గర్భిణికి నర్సులు వైద్యం మొదలు పెట్టారు. డాక్టర్ వాట్సాప్ వీడియో కాల్ ద్వారా ఆ గర్భిణికి వైద్యం అందిస్తుండగా తీవ్ర రక్తస్రావం జరిగి కవలలు మృతి చెందారు. విషయం తెలుసుకున్న డాక్టర్ హుటాహుటిన ఆస్పత్రికి వచ్చి గర్భిణీకి కావాల్సిన వైద్యం అందించారు.

ఆస్పత్రి డాక్టర్ నిర్లక్ష్యం వలనే ఈ ఘటన జరిగిందని ఆరోపిస్తూ కవలల తల్లిదండ్రులు, బంధు వులు సోమవారం ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. గర్భంలోనే కవలలు మృతి చెందారని, రూ.30వేల బిల్లు చెల్లించి వెళ్లిపోవాలని ఆస్పత్రి సిబ్బంది డిమాండ్ చేశారని ఆరోపించారు. వైద్యుల నిర్లక్ష్యం, స్టాఫ్ నర్సులు తెలిసి తెలియని వైద్యంతో గర్భంలోనే కవలలు చనిపోయారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న ఇబ్రహీంపట్నం పోలీసులు ఆస్పత్రికి చేరుకుని బాధితులకు సర్ధిచెప్పారు. అర్హత లేని వైద్యులతో అమాయకపు ప్రజలకు చికిత్సలు చే యించి లక్షల్లో ఫీజులు వసూళ్లు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్న ఆస్పత్రి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు.

ఈ ఘటనపై ఆస్పత్రిలో విచారణ జరిపిన జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి వెంకటేశ్వరరావు ఆస్పత్రిని సీజ్ చేశారు. ఈ ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్న రోగులను ఇతర ఆస్పత్రులకు తరలించారు. అర్హత లేకుండా వైద్య చికిత్సలు నిర్వహించటం, గర్భిణీ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని వైద్యాధికారి తెలిపారు. ఆస్పత్రి డాక్టర్ అనూషారెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఇబ్రహీంపట్నం సీఐ జగదీష్ తెలిపారు.



## పాక్‌కు చీనాబ్ నదీ జలాలు బంద్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌పై చేపట్టిన చర్యలలో భాగంగా సింధూ జలాల ఒప్పందాన్ని సస్పెండ్ చేసిన భారత్ తాజగా చీనాబ్ నది నుంచి పాక్‌కు వెళ్లే జలాలకు అడ్డుకట్ట వేసింది. పాకిస్థాన్‌లోకి ప్రవహించే చీనాబ్ నదీ జలాలను నియంత్రించే బాగ్లిహార్, సలాల్ డ్యాంల గేట్లను భారత ప్రభుత్వం మూసివేసింది. జమ్మూ కశ్మీరులోని రియాసీ జిల్లాలో ఉన్న సలాల్ డ్యామ్ గేట్లన్నీ మూసివేయడంతో దిగువ ప్రాంతాలలో నీటి ప్రవాహ స్థాయి పడిపోవడంతోపాటు చాలా చోట్ల నది ఎండిపోయినట్లు తెలుస్తోంది. బాగ్లిహార్ డ్యామ్ గేట్లను మూసివేయడంతోనూ ఇదే పరిస్థితి ఏర్పడింది. మరో ప్రధాన నది జీలం ప్రవాహాన్ని అడ్డుకునేందుకు నిర్మించిన కిషన్‌గంగా డ్యాం వద్ద కూడా ఇదే పరిస్థితి కనపడుతోంది.

# తెలంగాణ ఖ్యాతిని విశ్వమంతటికీ పరిచయం చేయాలి

- ఆ లక్ష్యంతో నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ పోటీలు విజయవంతంగా నిర్వహించాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- మిస్ వరల్డ్ ఏర్పాట్లపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఖ్యాతిని విశ్వమంతటికీ పరిచయం చేయాలన్న లక్ష్యంతో నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ పోటీలు విజయవంతంగా నిర్వహించేందుకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మే 10వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జరిగే ఈ ప్రపంచ స్థాయి పోటీల నిర్వహణకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులను అప్రమత్తం చేశారు.ప్రపంచ వ్యాప్తంగా 116 దేశాలకు చెందిన యువతులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా వారికి తెలంగాణ ఆతిథ్యం ఇవ్వాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ నెల 10 వ తేదీ నుంచి తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభం కాబోతున్న మిస్ వరల్డ్ ఏర్పాట్లపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు.

పోటీదారులతో పాటు దేశ విదేశాల నుంచి ఈవెంట్ కవరేజీకి దాదాపు 3 వేల మంది మీడియా ప్రతినిధులు, అతిథులకు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలతో స్వాగతించాలి. పోటీలు పూర్తయ్యేంత వరకు ఎక్కడా చిన్న



పొరపాటు లేకుండా ఏర్పాట్లు ఉండాలి.

పర్యాటక శాఖతో పాటు అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలి. అధికారులందరూ అప్పగించిన బాధ్యతలను సమర్ధంగా నిర్వహించాలి. ప్రతి కార్యక్రమానికి ప్రత్యేకంగా ఒక నోడల్ అధికారిని నియమించాలి. మే 10వ తేదీన సాయంత్రం హైదరాబాద్ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో మిస్‌వరల్డ్ ప్రారంభోత్సవం నుంచీ 31వ తేదీన జరిగే గ్రాండ్ ఫినాలే వరకు ప్రతి కార్యక్రమం విజయవంతంగా సాగాలి. మిస్ వరల్డ్ కార్యక్రమానికి వచ్చే

మిగితా 2వ పేజీలో

## టీజీఎస్ ఆర్టీసీ ఆస్పత్రిలో డీఎన్‌బీ పీజీ మెడికల్ కోర్సులకు అనుమతి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ తార్నాకలోని టీజీఎస్‌ఆర్టీసీ ఆస్పత్రిలో డిప్లొమేట్ ఆఫ్ నేషనల్ బోర్డ్ (డీఎన్‌బీ) పీజీ మెడికల్ కోర్సులకు అనుమతి లభించింది. మూడు విభాగాల్లో ఏడు సీట్లను నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్(ఎన్‌బీఈఎంఎస్) మంజూరు చేసింది.

డీఎన్‌బీ పీజీ మెడికల్ కోర్సులకు అనుమతి కోరుతూ ఎన్‌బీఈఎంఎస్‌కు ఇటీవల టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం దరఖాస్తు చేసింది. ఆర్టీసీ ఉద్యోగులకు మెరుగైన, నాణ్యమైన వైద్యం అందించేందుకు తమ ఆసుపత్రిలో పీజీ మెడికల్ కోర్సులకు అక్రిడిటేషన్ ఇవ్వాలని ప్రతిపాదించింది. ఈ దరఖాస్తును సమగ్రంగా పరిశీలించిన ఎన్‌బీఈఎంఎస్.. జనరల్ మెడిసిన్ 3 సీట్లను, జనరల్ సర్జరీ 2 సీట్లను, ఆర్థోపెడిక్ సర్జరీ 2 సీట్లను మంజూరు చేసింది. మూడేండ్ల పీజీ కోర్సులకు నీట్ ఆధారంగా, 2 ఏండ్ల డిప్లొమా కోర్సులకు డీఎన్‌బీ–పీడీసీఈటీ ద్వారా ప్రవేశాలు జరగుతాయి. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఈ కోర్సులు ప్రారంభం కానున్నాయి.తార్నాక ఆసుపత్రిలో డీఎన్‌బీ పీజీ మెడికల్ కోర్సులకు అనుమతి లభించడంపై టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. ఈ డీఎన్‌బీ పీజీ కోర్సులకు అనుమతి లభించడంతో ఆస్పత్రిలో వైద్య సేవలు మరింత బలోపేతమవుతాయని సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కోర్సుల వల్ల నాణ్యమైన వైద్యులు తమ ఆస్పత్రిలో ప్రాక్టిస్ చేస్తారని, ఇది ఆర్టీసీ ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. సిబ్బందికి మెరుగైన వైద్యం అందించేందుకు తార్నాక ఆస్పతిని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం తీర్చిదిద్దిందని గుర్తు చేశారు.

# సమ్మె వద్దు..

- ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి
- మంత్రిని కలిసిన ఆర్టీసీ సంఘాల నేతలు



**బలగం టీవీ, హైదరాబాద్**

ఆర్టీసీ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నదని, సమస్యలు తగ్గుతున్నాయని, ఇలాంటి దశలో సమ్మె చేయవద్దని ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ సిబ్బంది సమ్మె చేస్తే ప్రజలు ఇబ్బందులు పడతారని చెప్పారు. సమస్యలను ఎప్పుడైనా ప్రభుత్వం దృష్టికి తీసుకురావచ్చని, వినడానికి సీఎం, తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటామన్నారు. హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో ఆర్టీసీ సంఘాల నేతలు మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఆర్టీసీ సమస్యలపై, ఆర్టీసీ సంక్షేమం కోరే ఎవరైనా నేడు, రేపు ఎప్పుడైనా కలిసి సమస్యలు చెప్పవచ్చని, తాను ఎప్పుడూ అందుబాటులోనే ఉంటానన్నారు. ఆర్టీసీ సమస్యలు వినడానికి ముఖ్యమంత్రి కార్యాలయం తలుపులు కూడా ఎప్పుడూ తెరిచే ఉంటాయని చెప్పారు.

ఆర్టీసీ పరిరక్షణ, కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యం.. ఈ మూడింటికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. సంస్థ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నది. సమస్యలు తొలుగుతున్నాయి. సమ్మె చేయవద్దని ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేస్తున్న. మీ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయి, వాటి పరిష్కారానికి చొరవ తీసుకుంటా. ఆర్టీసీకి 16 నెలలుగా ఎన్నో మంచి కార్యక్రమాలు చేశాం. ఒక్కటైన ఇబ్బంది పెట్టామా. ఆర్టీసీ సమ్మె చేస్తే ప్రజలు ఇబ్బందులు పడతారని మంత్రి అన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు 2013 నుంచి చెల్లించాల్సిన బాండ్ మొత్తం రూ.400 కోట్లు చెల్లించామని తెలిపారు. 2017 పే స్కేల్ 21 శాతం ఇచ్చామని గుర్తుచేశారు. దీనివల్ల సంవత్సరానికి రూ.412 కోట్లు భారం పడుతుంది. పీఎఫ్ ఆర్గనైజేషన్‌లో సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న రూ.1039 కోట్లు చెల్లించాం. నెలవారీ పీఎఫ్ కంట్రిబ్యూషన్ 2024 జనవరి క్రమం తప్పకుండా చెల్లిస్తున్నాం. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సీసీఎస్ బకాయిలు ఉద్యోగులకు రూ.345 కోట్లు చెల్లించాం. నెలవారీ సీసీఎస్ కంట్రిబ్యూషన్ గతేడాది జనవరి నుండి క్రమం తప్పకుండా చెల్లిస్తున్నాం. 1500 మందికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇచ్చాం. ఆర్టీసీలో 3038 మంది ఉద్యోగులను నియమించుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కొత్త బస్సులు కొనుగోలు చేశాం, తార్నాక దవాఖానను సూపర్ స్పెషాలిటీగా మార్చామని వెల్లడించారు.మంత్రితో భేటీ అయినవారిలో ఆర్టీసీ జేఏసి ఛైర్మన్, టీఎంయూ జనరల్ సెక్రెటరీ అశ్వద్ధామ రెడ్డి, ఎన్ఎంయూ జనరల్ సెక్రెటరీ నరేందర్, కార్మిక సంఘ్ జనరల్ సెక్రెటరీ ఎర్ర స్వామి కుమార్, ఎస్‌టీఎంయూ జనరల్ సెక్రెటరీ పున్న హరి కృష్ణ, పలువురు ఆర్టీసీ సంఘాల నేతలు ఉన్నారు.

# సమ్మె తప్పదు




- ఆర్టీసీ జేఏసీ

**బలగం టీవీ, హైదరాబాద్**

ఆర్టీసీలో సమ్మె తప్పేలా కనిపించడం లేదు. ఉదయం రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చర్చలు జరిగినా, అవి ఫలవంతం కాకపోవడంతో బస్సుల నిలిపివేత తప్పదని ఆర్టీసీ జేఏసీ ప్రకటించింది. ఈనెల 7వ తేదీ అర్థరాత్రి నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని బస్సులు నిలిపివేస్తామని జేఏసీ నాయకులు తెలిపారు. ఈ మేరకు సమ్మె సన్నద్ధతలో భాగంగా భారీ ఎత్తున కార్మికులతో కవాతు నిర్వహించింది.

హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళాభవన్ నుంచి బస్సు భవన్ వరకు కార్మిక కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ఛైర్మన్ ఈదురు వెంకన్న పాల్గొని మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం 10 ఏండ్ల కాలంలో ఏ ఒక్క సమస్యను కూడా పరిష్కరించకపోగా ఉన్న సమస్యలను పెంచి ఆర్టీసీ ఉద్యోగులను సర్వనాశనం చేసిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో టీజీఎస్‌ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని, వేతన సవరణలు చేస్తామని, యూనియన్లను పునరుద్ధరిస్తామని, ఆర్టీసీని అభివద్ధి చేస్తామని, కొత్త బస్సులు కొంటామని పొందుపరిచిందన్నారు. ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడుస్తున్నా సమస్యలను పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రావడానికి ప్రతి ఆర్టీసీ ఉద్యోగి ముందుండి పని చేశారని, అటువంటి తమను విస్మరించడం తగదన్నారు. జేఏసీ కో చైర్మెన్ కే.హనుమంతు ముదిరాజ్ మాట్లాడుతూ టీజీఎస్‌ఆర్టీసీలో ప్రస్తుతం యూనియన్లు లేకపోవడంతో ఎంటీడబ్ల్యూ యాక్ట్ అమలు చేయకుండా రోజుకు 16 గంటల వరకు చట్ట వ్యతిరేకంగా డ్యూటీలు చేయిస్తున్నారని ఆరోపించారు. 2021-25 వేతన సవరణ వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ వైస్ చైర్మెన్ ఏం థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండీ మౌలానా, కో కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి.యాదగిరి, తదితర నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

# సమరం కాదు సమయస్ఫూర్తి కావాలి

(మొదటి పేజీ తరువాయి)

కారణమని గర్వంగా చెబుతున్నానని అన్నారు.సరిహద్దుల్లో దేశ భద్రతను సైనికులు ఏ విధంగా కాపాడుతున్నారో, రాష్ట్రంలో అంతర్గత శాంతి భద్రతలను హోంగార్డు నుంచి డీజీపీ వరకు దాదాపు 90 వేల మంది పోలీసు సిబ్బంది 4 కోట్ల తెలంగాణ ప్రజలను కంటికి రెప్పలా కాపాడుతున్నారని ముఖ్యమంత్రి గారు పోలీసు యంత్రాంగాన్ని ప్రశంసించారు.

రాష్ట్రంలో వివిధ సందర్భాల్లో విశేష ప్రతిభ కనబరిచిన వివిధ హోదాల్లో పనిచేస్తున్న 22 రియల్ హీరోస్ (పోలీసు) జీ తెలుగు సంస్థ అవార్డుల బహూకరణ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. “పోలీసులు ఎంత నిబద్ధతతో పనిచేసినా విమర్శలు తప్పడం లేదు. పోలీసు శాఖలోని ఒకట్రెండు శాతం సిబ్బంది నిర్లక్ష్యం, అవగాహనా లోపం వల్ల సిబ్బందిపైన అనుమానాలు, అవమానాలు తప్పడం లేదు. పోలీసు శాఖ రోజులో 18 గంటలు పనిచేస్తుంది. విధి నిర్వహణలో పోలీసులు పిల్లల చదువుల కోసం సమయాన్ని కేటాయించలేకపోతున్నారు. పోలీసు పిల్లల భవిష్యత్తు కోసమే యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రారంభించాం. దాన్ని సద్వినియోగం చేసుకోవాలి. శాంతి భద్రతలు కాపాడటంలో తెలంగాణ నంబర్ 1 ర్యాంక్‌లో నిలిచింది. నిత్యవసర వస్తువుల ధరలను నియంత్రించడంలోనూ మొదటి స్థానంలో ఉన్నాం. సైబర్ క్రైమ్‌లో కొల్లగొడుతున్న సొమ్ముని రికవరీ చేయడంలోనూ దేశంలో మనం తొలిస్థానంలో ఉన్నాం. డ్రగ్స్ విషయంలో కూడా ఉక్కుపాదంతో అణిచివేయాలి. అందుకే డ్రగ్స్ నియంత్రించడానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసుకున్నాం.

నేరం జరిగిన తర్వాత పట్టుకోవడం కంటే నేరం జరక్కుండా నియంత్రించాల్సిన బాధ్యత కూడా పోలీసులపైన ఉన్నది. ఆ దిశగా పోలీసు వ్యవస్థను అధునీకరించుకోవాలి. సాంకేతిక నైపుణ్యాన్ని సాధించుకోవాలి. హోంగార్డు నుంచి ఉన్నతాధికారుల వరకు అందరూ సేవలు అందించేలా ఉండాలి. అందుకు ప్రభుత్వం అండగా నిలుస్తుంది. ప్రభుత్వం వెన్ను తడుతుంది. మంచి పనిని అభినందిస్తుంది.ప్రభుత్వ ఉద్యోగులకు ఏవైనా సమస్యలు ఉంటే చర్చించుకుందాం. 4 కోట్ల తెలంగాణ ప్రజల సంక్షేమం, అభివృద్ధి, రాష్ట్ర శాంతి భద్రతలను, పెట్టుబడులను అన్నింటినీ కాపాడుకోవలసిన అవసరం ఉంది. మనమంతా బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ఆర్థిక పరంగా రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులకు స్వీయ నియంత్రణ పరిష్కారం.ఆర్టీసీ, సింగరేణి, విద్యుత్ కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగస్తులు దయచేసి అర్థం చేసుకోవాలి. ఇప్పుడు రాష్ట్రానికి కావలసింది సమయస్ఫూర్తి. తెలంగాణను అభివృద్ధి పథంవైపు నడిపించుకుందాం. ప్రపంచానికి ఆదర్శంగా రాష్ట్రాన్ని నిలబెట్టుకుందాం” అని ముఖ్యమంత్రి వివరించారు.ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ , సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి , ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు , హోం శాఖ ముఖ్య కార్యదర్శి రవి గుప్త , డీజీపీ జితేందర్ , హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ , జీ న్యూస్ ప్రతినిధులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వివిధ సందర్భాల్లో విశేష ప్రతిభ కనబరిచిన 22 మంది పోలీసులకు (రియల్ హీరోలు) ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా జీ అవార్డులు- 2025 లను బహూకరించారు.

## తెలంగాణ ఖ్యాతిని విశ్వమంతటికీ పరిచయం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

విదేశీ అతిథులు బస చేసే హోటళ్లతో పాటు హైదరాబాద్‌లో వారు పర్యటించనున్న చార్మినార్, లాడ్‌బజార్, చౌమహల్లా ప్యాలెస్, సెక్రటేరియట్ తెలంగాణ తల్లి వంటి ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలి. వారికి అవసరమైన రవాణా, వసతులు ఏర్పాటు చేయాలి. అత్యవసర పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ ప్రణాళికలు ఉండాలి.

మహిళా సాధికారతను చాటిచెప్పేలా రాష్ట్రంలో ఐకేపీ మహిళలు నిర్వహిస్తున్న డ్వాక్రా బజార్ సందర్శనతో పాటు, ఉప్పల్ స్టేడియంలో ఐపీఎల్ సెమీఫైనల్స్ తిలకించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలి. హైదరాబాద్?లో మిస్ వరల్డ్ కార్యక్రమాలు జరిగే ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు, విద్యుత్తు అంతరాయం రాకూడదు. వాతావరణ సూచనలకు అనుగుణంగా గ్రేటర్ సిటీ పరిధిలో ఇబ్బందులు తలెత్తకుండా జీహెచ్ఎంసీతో పాటు హైడ్రా విభాగాలు అప్రమత్తంగా ఉండాలి.రాష్ట్రంలోని ప్రజా ప్రతినిధులతో పాటు వివిధ రంగాల్లో ప్రముఖులను ప్రభుత్వం తరఫున మిస్ వరల్డ్ 2025 ప్రారంభోత్సవానికి ఆహ్వానించాలి. రాష్ట్రంలోని ప్రభుత్వ గురుకులాలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూళ్లు, మోడల్ స్కూళ్లు, కస్తూరిబా పాఠశాలలకు చెందిన విద్యార్థులను కూడా ఒకరోజు మిస్ వరల్డ్ వేడుకలు చూపించాలి. వేడుకలు జరిగే రోజుల్లో హైదరాబాద్ అంతటా మిస్ వరల్డ్ సందడి కనిపించేలా తోరణాలు, లైటింగ్, హోర్డింగ్‌లతో పాటు సిటీలోని ముఖ్యమైన జంక్షన్లు, చారిత్రక ప్రదేశాలను అందంగా అలంకరించాలి. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు గారు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి గారు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు గారు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ గారు, రాష్ట్ర డీజీపీ జితేందర్ గారు, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ గారు, రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు గారు, ఏడీజీపీ స్టీఫెన్ రవీంద్ర గారితో పాటు అన్ని విభాగాల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## సింహాచలం ఘటనలో ఏడుగురు అధికారులపై వేటు

(మొదటి పేజీ తరువాయి)

జారీ చేసింది. సింహాచలం ఆలయ ప్రాంగణంలో గోడ కూలిపోవడంతో ఏడుగురు భక్తులు మరణించడం తెలిసిందే. దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఘటనకు గల కారణాలను, బాధ్యులను గుర్తించేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని నియమించింది. ఈ కమిటీ క్షుణ్ణంగా విచారణ జరిపి, ప్రభుత్వానికి తమ నివేదికను అందజేసింది. అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని కమిటీ తన నివేదికలో స్పష్టం చేసినట్లు సమాచారం. కమిటీ నివేదికను పరిశీలించిన ప్రభుత్వం, బాధ్యులపై తక్షణ చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో దేవాదాయ శాఖ మరియు ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)కు చెందిన ఏడుగురు అధికారులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సస్పెన్షన్‌కు గురైన వారిలో ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) కె. సుబ్బారావు, ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) శ్రీనివాసరావు, ఏపీటీడీసీ ఈఈ రమణ, డిప్యూటీ ఈఈలు కె.ఎస్.ఎన్. మూర్తి, స్వామి, ఏపీటీడీసీ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) పి.మదన్, ఆలయం జూనియర్ ఇంజనీర్ (జేఈ) కె.బాబ్జీ ఉన్నారు.

# రాష్ట్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

(మొదటి పేజీ తరువాయి)

కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ ఆయా ప్రాంతాల్లో భూసేకరణ పూర్తి చేయాలి” అని అన్నారు.

నో అనే మాట గడ్కరీ నోటి నుంచి రాదని ఎంపీఈటల రాజేందర్ అన్నారు. ఉప్పల్, కొంపల్లి కారిడార్లు వేగవంతం చేయాలని కేంద్రమంత్రిని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్, కరీంనగర్ హైవేను జాతీయ రహదారిగా ప్రకటించాలని కోరారు. రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ విజయవాడ రహదారిని అభివృద్ధి చేయాలని గడ్కరిని కోరారు. రాష్ట్ర బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ “గత ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని సహాయం అడగలేదు మా ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సహాయం తీసుకోవడానికి సిద్ధంగా ఉంది. మా ప్రాంత ప్రజలకు ఉపయోగపడే హైదరాబాద్ కరీంనగర్ మీదుగా రామగుండం వెళ్ళే రాజీవ్ రహదారి ని 8 లేన్ రోడ్డుగా మార్చగలరు. మాకు సహకరించి సహాయం చేయగలరు” అని అన్నారు. ఈ సమావేశంలో ఎంపీలు డాక్టర్ కే. లక్ష్మణ్, అరవింద్ కుమార్, కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్యే మహేష్ రెడ్డి, మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## కళాశాల అధ్యాపకుల ఇంటింటి ప్రచారం

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు ఇంటింటా ప్రచారంలో భాగంగా సోమవారం రోజు ప్రచారం చేశారు. నారాయణపూర్,గజ సింగవరం లో పదవ తరగతి పాసైన విద్యార్థులను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరవలసిందిగా కోరారు.ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిన విద్యార్థుల జిల్లా రాష్ట్రస్థాయిలో మార్కులు సాధించడం జరిగింది. కావున పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు మనకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరి మీ యొక్క భవిష్యత్తును బంగారు భవిష్యత్తుగా తీర్చి దిద్దుకోవాల్సిందిగా అధ్యాపకులు తల్లిదండ్రులను తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరితే విద్యార్థులకు ఉచిత విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, స్కాలర్షిప్ , లైబ్రరీ, జాతీయ సేవా పథకం, విశాలమైన క్రీడా మైదానం మొదలైనవి విద్యార్థులు వినియోగించుకోగలరని అధ్యాపకులు కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు వాసర వేణి పర్శరాములు, ఖ్యాతం సత్యనారాయణ, మాదాసు చంద్రమౌళి పాల్గొన్నారు.

## నేత కార్మికుల ఆత్మహత్యలు బాధాకరం..

**బీఆర్టియు రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



బత్తుల విఠల్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ (బీఆర్టియు) రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ.. పజాపాలన అందిస్తున్నాము అని గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం, నేతన్నల ఆత్మహత్యలను ఎందుకు ఆపలేకపోతోందో సమాధానం చెప్పాలని అన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి, నేత కార్మికులకు ఉపాధి కరువై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. “నేత కార్మికులకు నిరంతరం ఉపాధి కల్పిస్తామని ప్రభుత్వం గొప్పలు చెప్పడం తప్ప, ఆచరణలో ఏమీ లేదు” అని విమర్శించారు. సిరిసిల్లలో ఇంతమంది నేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కనీసం వారి కుటుంబాలను పరామర్శించకపోవడం బాధాకరమని అన్నారు.గత ప్రభుత్వం నేతన్నలకు నిరంతర ఉపాధి కల్పించడంతో పాటు, వారి సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి వారి కుటుంబాలకు అండగా నిలిచిందని శ్రీనివాస్ గుర్తు చేశారు. ఆకలి చావులు, ఆత్మహత్యలను నివారించిన ఘనత కేసీఆర్, కేటీఆర్ లదే అని ఆయన అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి, నేత కార్మికులకు నిరంతరం ఉపాధి కల్పించాలని, మెరుగైన కూలీ వచ్చేలా చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న బత్తుల విఠల్ కుటుంబాన్ని ఆయన పరామర్శించి, %దీక్షూ% పార్టీ వారి కుటుంబానికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ దూస వినయ్, బిఆర్?ఎస్? సీనియర్ నాయకులు బత్తుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.


## కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతుల పక్షపాతి..




**-జిల్లాలో సాగునీరు ఇబ్బందులు దూరం చేసేందుకే పనులు**

**-ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతుల పక్షపాతి అని,రైతన్నల సంక్షేమమే లక్ష్యముగా సి ఎం రేవంత్ రెడ్డి నాయకత్వం లో ప్రభుత్వం ముందుకు పోతుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కోనరావుపేట మండలం మల్కాపే టలోని మల్కాపేట రిజర్వాయర్ కుడి కాలువ ద్వార నీటిని ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఇరిగేషన్ అధికారులతో కలిసి నీటిని విడుదల చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కుడి కాలువ కు నీటిని విడుదల చేయడం జరిగిందని అన్నారు. మల్కాపేట రిజర్వాయర్ కుడికాలు ద్వారా వేములవాడ నియోజకవర్గంలోని 12 గ్రామాలకు సాగునీరు అందనుందని,ప్యాకేజీ లైన్ లో భాగంగా మల్కాపేట రిజర్వాయర్ కుడికాలువ ద్వారా కోనరావుపేట మండలం మల్కాపేట, కనగర్తి, నాగారం, పల్లిమక్త, సుద్దాల, రామన్నపేట, మంగళపల్లి గ్రామాలకు, అలాగే వేములవాడ మండలం మారుపాక వరకు నీటిని విడుదల చేశామని అన్నారు. మల్కాపేట కుడి కాలువకు 250 క్యూసెక్కులు విడుదల చేశామని, దాదాపు 8 వేల ఎకరాలకు సాగునీరు, అలాగే ఆయా గ్రామాలకు తాగునీరు అందుతుందని అన్నారు.

పదేళ్లుగా పడావు పడ్డ కాలువ పనులను పూర్తి చేసి అందులో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించడం జరిగిందని అన్నారు. రైతులకు సాగునీరు అందించిన లక్ష్యంతో మంత్రులతో మాట్లాడి ఎల్లారెడ్డిపేట వరకు రైతాంగానికి నీటిని విడుదల చేయడం జరిగిందని,మెయిన్ కెనాల్ ద్వారా నీటిని విడుదల చేసి అక్కపల్లి, బుగ్గ రాజేశ్వర తండా, అల్మాస్పూర్ రాజన్నపేట దేవుని గుడి తండా, గొల్లపల్లి బాకృం పల్లి తిమ్మాపూర్ వరకు నీటిని విడుదల చేయడం జరిగిందని అన్నారు.

భూ నిర్వాసితులకు నష్ట పరిహారం అందజేసి కాలువ పనులు ప్రారంభం చెసి నీటిని విడుదల చేశామని,ఎడమ కాలువ కోసం ఇప్పటి వరకు 70 ఎకరాల భూమిని సేకరించడం జరిగిందని మరో 70 ఎకరాలు భూసేకరణ చేయడం జరుగుతుందని అన్నారు.దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ధనిక పేద తేడా లేకుండా మేనిఫెస్టో లో చెప్పకున్నా సన్నం బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని,.అభివృద్ధిలో భాగంగా ఇప్పటికే మల్కాపేట రామాలయం వరకు 90 లక్షలతో సీసీ రోడు నిర్మాణం చేపట్టడం జరిగిందని, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసామని అన్నారు.

**ధాన్యం కొనుగోలు పై ఆందోళన చేసిన వారు తెలుసుకోవాలి...**

ఇటీవల కొందరు వరి ధాన్యం కొనుగోలు పై ఆందోళనలు చేశారని, వారు ఒక విషయం తెలుసుకోవాలని, సిరిసిల్ల జిల్లాలో యాసంగి మే 01 నాటికి 2021-22 లో 233 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారని,2022-23 లో 9 వేల 424 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారనిఅన్నారు..

ఒక రైతుతో మాట్లాడితే గతంలో ఏ విధంగా మోసం చేశారో చెప్పారని,తాలు తప్ప పేరుతో రైతులను మోసం చేసి సంచికి 44 కిలోలు జోకీ రైతులను నిలువునా ముంచారని అన్నారు.రైస్ మిల్లర్లు బ్యాంకు గ్యారంటీ ఇవ్వకున్నా రైతులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఉండాలని ఇంటర్మీడియట్ గోదాములు పెట్టి వడ్లను దిగుమతి చేసుకోవడం జరుగుతుందన్నారు.

మహిళ తల్లులను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు పోతుందని, రాజన్న సిరిసిల్ల జిల్లా లో 600 కొట్లు బ్యాంకు లింకేజి చేయడం జరిగిందన్నారు. కోనరావు ఎట మండలం ధర్మారం గ్రామంలో 4 మెగావాట్ల సోలార్ పవర్ విద్యుత్తు ఉత్పత్తి కేంద్రం మంజూరు చేయడం జరిగిందని అన్నారు. మహిళలు ముందుకు వస్తే రైస్ మిల్లులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

ధరణి చట్టంతో రైతులు చాలా ఇబ్బంది పడ్డారని వాటిని పరిష్కరించేందుకే భూ భారతి చట్టం అమలు చేయనున్నామనిఅన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్లు కచ్చకాయల ఎల్లయ్య, రొండి రాజు, చెలుకల తిరుపతి వైస్ చైర్మన్ ప్రభాకర్ ,జిల్లా నీటిపారుదల శాఖ అధికారి అమరేందర్ రెడ్డి ఈ ఈ కిషోర్, డీఈలు సత్యనారాయణ, వినోద్, శ్రీనివాస్ నీటిపారుదల శాఖ అధికారులు, డి ఆర్ డి ఓ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయం..

**-ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ**

ప్రజలకు మెరుగైన కనీస సౌకర్యాలు, వైద్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు.ఆదివారం వేములవాడ పట్టణ పరిధిలోని శాత్రాజ్ పల్లిలో రూ. కోటి 43 లక్షల తో ఆర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మాణానికి ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి శంకుస్థాపన చెసి అనంతరం భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ శాత్రాజ్ పల్లి చాలా చైతన్య వంతం కలదని, .ఎందరో ప్రభుత్వ ఉద్యోగులను అందించిన చరిత్ర దీనికి గలదని అన్నారు. అనాడు ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి చెస్తూ ముందుకూ పోతున్నామని స్పష్టం చేశారు.శాత్రాజ్ పల్లిలో 30 పడకల ఆసుపత్రి నిర్మిస్తే చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, ఈ ప్రాంతం వైద్యానికి హబ్ గా ఏర్పడుతుందనిఅన్నారు. ఎవరు అడగకున్నా ఆసుపత్రి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయడం జరిగిందని,సైడ్ డ్రైన్ నిర్మాణానికి రూ. 12 లక్షల నిధులు మంజూరు చేయడం జరిగిందనిఅన్నారు..

**విప్ ప్రత్యేక చొరవతోనే...**

అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్




ప్రత్యేక చొరవతో హెల్త్ సెంటర్ ప్రభుత్వం మంజూరు చేసిందని, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**సుందరీకరణ పనులకు శంకుస్థాపన..**

వేములవాడ పట్టణంలో తిప్పాపూర్ బస్టాండ్ నుండి చెక్ డ్యామ్ వరకు, మిగిలిన బండ్ అభివృద్ధి, సుందరీకరణ పనులకు ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ తిప్పాపూర్ నుంచి మూలవాగు ఎడమ వైపు రూ.80 లక్షల తో సుందరీకరణ పనులను ప్రారంభం చేయడం జరిగిందన్నారు.ఒక ఆహ్లాదకమైన వాతావరణం కల్పించేందుకు నేడూ శంకుస్థాపన చేయడం జరిగిందనిఅన్నారు.

రాజన్న ఆలయ అభివృద్ధికి పెద్ద పీట వేశామని ఇప్పటికే పలుమార్లు ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించామని అన్నారు. శృంగేరి పీఠాధిపతి సలహాలు సూచనల మేరకే పనులకు శ్రీకారం చుట్టాలు ఉన్నామని వివరించారు. రాజన్న గుడి చెరువులోకి మురుగు నీరు కలవకూడ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, వైస్ చైర్మన్ రాకేష్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే..

**- ఎస్పీ మహేష్ బి.గితే**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎస్పీ మహేష్. బి.గితే అన్నారు.సోమవారంసిరిసిల్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని ఎస్పీ మహేష్ బి.గితే నిర్వహించారు. బాధితుల నుండి నుండి 32 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మహేష్. బి.గితే మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని అన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని,తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చూస్తామని అన్నారు.



## వన్డే, టీ20 ర్యాంకింగ్స్‌లో భారత్ టాప్

**బలగం టీవి, హైదరాబాద్**

అంతర్జాతీయ క్రికెట్ మండలి . పురుషుల క్రికెట్‌కు చెందిన వార్షిక ర్యాంకింగ్స్‌ను సోమవారం రిలీజ్ చేసింది. వన్డేలు, టీ20ల్లో ఇండియా టాప్‌లో నిలిచింది. ఇక టెస్టు ఫార్మాట్‌లో ఆస్ట్రేలియా ఫస్ట్ ప్లేస్‌లో నిలవగా, ఇండియా నాలుగో స్థానానికి పడిపోయింది. 2024 మే నుంచి ఆడిన మ్యాచ్‌ల ఆధారంగా ర్యాంకులను వెల్లడించారు.

వన్డే ర్యాంకుల్లో ఇండియా అగ్రస్థానంలో ఉన్నది. ఇటీవల ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీని భారత్ గెలుచుకున్నది. రేటింగ్‌ను 122 నుంచి 124కు పెంచింది. చాంపియన్స్ ట్రోఫీ రన్నరప్ న్యూజిలాండ్ రెండో స్థానంలో ఉన్నది. ఇక ఆస్ట్రేలియా మూడో స్థానంలో ఉంది. టీ20ల్లో ఇండియానే వరల్డ్ చాంపియన్. ప్రస్తుతం మన జట్టు టాప్‌లో ఉన్నది. రెండో స్థానంలో ఉన్న ఆస్ట్రేలియా కన్నా 9 పాయింట్లు ఆధిక్యంలో భారత్ ఉన్నది. ఇంగ్లండ్, న్యూజిలాండ్, వెస్టిండీస్ జట్లు ఆ తర్వాత ర్యాంకుల్లో ఉన్నాయి. టెస్టుల్లో ఆస్ట్రేలియా లీడింగ్‌లో ఉన్నది. టీమ్ ర్యాంకింగ్స్‌లో ఆ జట్టు టాప్ ప్లేస్ లో ఉంది. వార్షిక పాయింట్లు 15 నుంచి 13కు తగ్గినా.. పాట్ కమ్మిన్స్ నేతృత్వంలోని ఆస్ట్రేలియా 126 పాయింట్లతో అగ్రస్తానంలో నిలిచింది. బెన్ స్టోక్స్ నేతృత్వంలోని ఇంగ్లండ్ జట్టు రెండో స్థానానికి ఎగబాకింది. సౌతాఫ్రికా, ఇండియాను ఆ టీమ్ వెనక్కినెట్టింది. ఈ ఏడాది ఆడిన 4 టెస్టుల్లో ఇంగ్లండ్ మూడింటిలో విజయం సాధించింది. ఇంగ్లండ్ రేటింగ్ పాయింట్లు 113 కాగా, దక్షిణాఫ్రికా 111, ఇండియా 105 పాయింట్లతో మూడవ, నాలుగవ స్థానాల్లో ఉన్నాయి.

## షమీకి బెదిరింపు ఈమెయిల్..!

**బలగం టీవి, హైదరాబాద్**

భారత జట్టు పేసర్ మహ్మద్ షమీకి బెదిరింపు ఈమెయిల్ ఒకటి వచ్చింది. రూ. 1 కోటి ఇవ్వకుంటే చంపేస్తామని స్పీడ్‌స్టర్‌ను డిమాండ్ చేశాడు ఆ వ్యక్తి. అతడు మే 4 ఆదివారం సాయంత్రం సమయంలో ఈమెయిల్ ద్వారా బెదిరిస్తూ రూ. 1 కోటి డిమాండ్ చేశాడు. దాంతో, భయాందోళనకు గురైన షమీ సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దాంతో, అమ్రోహాలోని పోలీసులు రాజ్‌పుత్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సైబర్ సెల్ విభాగం సమన్వయంతో కేసును విచారిస్తున్న పోలీసులు షమీని బెదిరించిన వ్యక్తి పేరు రాజ్‌పుత్ సింధార్ అని.. రాజ్‌పుత్‌ను కర్నాటకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. అతడిని కస్టడీలోకి తీసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు.

## పార్టీ నిర్మాణం తో పాటు కార్యకర్తలను కాపాడుకుంటాం

### పీసీసీ పరిశీలకులు ఖాజా ఫక్రుద్దీన్ ,చైతన్య కృష్ణారెడ్డి

**బలగం టీవీ,ఎల్లారెడ్డిపేట**



కాంగ్రెస్ పార్టీ నిర్మాణంతోపాటు కార్యకర్తలకి అన్ని విధాలుగా అండగా ఉంటామని, ఇది ఏఐసీసీ ఇచ్చిన సందేశం అని పీసీసీ పరిశీలకులు ఖాజా ఫక్రుద్దీన్, చైతన్య కృష్ణారెడ్డి అన్నారు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య అధ్యక్షతన ఎల్లారెడ్డిపేట గంభీరావుపేట మరియు వీర్నపల్లి మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పిసిసి పరిశీలకులు ఖాజా ఫక్రుద్దీన్,చైతన్య కృష్ణారెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ గ్రామ గ్రామాన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులను కొత్తగా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.. మండల శాఖ అధ్యక్షులను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులను జిల్లా అధ్యక్షులను కొత్తవారిని ఎంపిక చేయడమే తమ బాధ్యత అని పిసిసి పరిశీలకులు అన్నారు. ఈ నెల ఆరు ఏడు ఎనిమిది తేదీలలో మూడు మండలాలకు సంబంధించిన గ్రామస్థాయి కార్యకర్త నుండి జిల్లా స్థాయి నాయకుల వరకు అందరినీ కలిసి నూతన కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మండల స్థాయి కమిటీలు కాగానే జిల్లా స్థాయి కమిటీలను పిసిసి కార్యవర్గం పరిశీలించి నియామకాలు చేపట్టడం జరుగుతుందని ఇది తెలంగాణ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ఆదేశాలు అన్నారు.ఇప్పటికే జిల్లా స్థాయిలో సమీక్ష సమావేశాలను పూర్తి చేశామని ఈరోజుతో మండల స్థాయి సమావేశాలు కూడా పూర్తి అయ్యాయని అన్నారు..గ్రామస్థాయి కానీ మండల స్థాయి కానీ అధ్యక్షులకు ఐదు పేర్లు కు తగ్గకుండా ఎస్సీ బీసీ మైనారిటీ జనరల్ నుండి పార్టీ అధ్యక్షుల పేర్లను పిసిసికి పంపిస్తామన్నారు.కార్యకర్తల నుండి నాయకుల ప్రక్రియ నేరుగా కొనసాగుతుందని కార్యకర్తల అభిప్రాయం మేరకే ఈ ఎన్నిక జరుగుతుందన్నారు.కాంగ్రెస్ పార్టీలో కొత్తగా చేరిన వారికి కూడా సమచితమైన ప్రాధాన్యం కల్పిస్తామని కొత్త పాత తేడా లేకుండా కార్యకర్తలు కలిసిపోయి పని చేసుకోవాలన్నారు. నామినేటెడ్ పోస్టులలో తాత వారికే అవకాశం ఇస్తామని రానున్న ఎన్నికలలో కొత్త వారి బలాబలాలు తెలుసుకొని సర్పంచ్ ఎంపీటీసీలు జడ్పిటిసిలలో అభ్యర్థులను నిలుపుతామన్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలో ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి మాజీ మంత్రి కేటీఆర్ కు మూడు చెరువుల నీళ్ల తాగించడం జరిగిందన్నారు. కార్యకర్తలందరూ ఒకే తాటిపైకి వస్తే సిరిసిల్ల నియోజకవర్గం లో మన అభ్యర్థి జెండా ఎగరవేయడం ఖాయమన్నారు. కేకే మహేందర్ రెడ్డి నియోజకవర్గంలో కార్యకర్తలను కలుపుకొని కష్టపడడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట,వీర్నపల్లి మండల శాఖ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, ఎండి హమీద్, భూత శ్రీనివాస్ తో పాటు ఆయా మండలాల మార్కెట్ కమిటీ చైర్మన్ లు రాముల నాయక్ కొమిరిశెట్టి విజయ,ఎస్ కే సాబేరా బేగం, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు హరిలాల్, మైనార్టీ సెల్ అధ్యక్షులు సాహెబ్, జిల్లా నాయకులు షేక్ గౌస్ ,లింగం గౌడ్, గిరిధర్ రెడ్డి, వైస్ చైర్మన్ రామ్ రెడ్డి, మూడు మండలాల నాయకులు కార్యకర్తలు ఈ సమావేశంలో పాల్గొన్నారు...


# ఉప్పల్‌లో వర్షార్పణం.. సన్‌రైజర్స్ అవుట్

- ఢిల్లీ క్యాపిటల్స్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్ రద్దు

**బలగం టీవి, హైదరాబాద్**




ఐపీఎల్ 2025 సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌తో ఉప్పల్ వేదికగా సోమవారం జరిగిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దయ్యింది. ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటింగ్ అనంతరం భారీ వర్షం రావడంతో మ్యాచ్‌కు అంతరాయం కలిగింది. వర్షం ఆగిపోయినా.. మైదానం



మొత్తం చిత్తడిగా మారిపోయింది. దాంతో కాసేపు వేచి చూసిన అంపైర్లు మ్యాచ్‌ను కొనసాగించే పరిస్థితి లేకపోవడంతో రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయించారు. ఈ నిర్ణయంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్లే ఆఫ్స్ అవకాశాలు ఆవిరయ్యాయి.ఈ మ్యాచ్ గెలిచి ఉంటే సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు కాస్తో కూస్తో ప్లే ఆఫ్స్ అవకాశాలు ఉండేవి.

ముందుగా బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 133 పరుగులు మాత్రమే చేసింది. ట్రిస్టన్ స్టబ్స్(36 బంతుల్లో 4 ఫోర్లతో 41 నాటౌట్), అషుతోష్ శర్మ(26 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 41) టాప్ స్కోరర్లుగా నిలవగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్(3/19) మూడు వికెట్లతో ఢిల్లీ పతనాన్ని శాసించాడు. జయదేవ్ ఉనాద్కత్, హర్షల్ పటేల్ చెరో వికెట్ తీసారు. ప్రత్యర్థిని తక్కువ స్కోర్‌కు పరిమితం చేశామనే సన్‌రైజర్స్ ఆనందం ఎక్కువసేపు నిలవలేదు.

## రబడకు గ్రీన్ సిగ్నల్

**బలగం టీవి, హైదరాబాద్**



గుజరాత్ టైటాన్స్‌కు ఊరట లభించింది. 18వ సీజన్‌లో ఆడేందుకు కగిసో రబడకు లైన్ క్లియర్ అయింది. దక్షిణాఫ్రికా క్రికెట్‌బోర్డు 'డ్రగ్ ఫ్రీ స్పోర్ట్స్' క్లీన్‌చిట్ ఇచ్చింది. రెండు సెషన్ల కౌన్సిలింగ్ పూర్తికావడంతో అతడిపై విధించిన నిషేధాన్ని ఎత్తివేస్తున్నట్లు ఆ దేశ క్రికెట్ బోర్డు సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. దాంతో, నిషేధం కారణంగా ఐపీఎల్‌కు దూరమైన రబడ త్వరలోనే గుజరాత్ జట్టుతో కలువనున్నాడు. దీంతో గుజరాత్ టైటాన్స్ పేస్ దళం ప్రసిధ్, సిరాజ్, ఇషాంత్‌లతో పాటు రబడా చేరికతో మరింత పటిష్ఠంగా తయారైంది. జనవరి 21న కేప్‌టౌన్, డర్బన్ సూపర్ జెయింట్స్ మ్యాచ్ తర్వాత అతడికి డోప్ టెస్టు నిర్వహించగా పాజిటివ్ వచ్చింది. అతడి రక్త నమూనాల్లో నిషేధిత డ్రగ్ ఉన్నట్టు అధికారులు గుర్తించారు. అయితే.. అప్పటికే ఐపీఎల్ 18వ సీజన్ కోసం రబడ భారత్‌కు వచ్చేశాడు. ఈ నిషేధం కారణంగా అతడు తిరిగి మళ్లీ దక్షిణాఫ్రికా వెళ్లిపోయిన విషయం తెలిసిందే.

## దర్శకుడు తేజకు జాతీయ అవార్డ్

**బలగం టీవి, హైదరాబాద్**



దర్శకుడు తేజ హైదరాబాదుకు చెందిన ఏఐ స్టార్టప్ న్యూరానిక్స్‌తో కలిసి, ఇండియాలో మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ రంగాన్ని రక్షించే పరిష్కారాలను అభివృద్ధి చేసి జాతీయ యాంటీ–పైరసీ చాలెంజ్ అవార్డును గెలుచుకున్నారు. అమీర్ ఖాన్ చేతుల మీదుగా తేజ ఈ అవార్డ్ అందుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..పైరసీ అనేది పెన సవాల్ కాగా, ఆన్‌లైన్‌లో కంటెంట్ వచ్చాక టేక్ డౌన్ చేయడం సరైనది కాదు. తొలి రోజు నుండే కంటెంట్ రక్షించుకోవాలి. అందుకోసమే మేము న్యూరానిక్స్ తో భాగస్వాములుగా మారాము అని తేజ తెలిపారు. వేవ్స్ 2025 ప్రదర్శనని నరేంద్ర మోడీ సందర్శించి మేడ్ ఇన్ ఇండియా ఫర్ ది వరల్డ్ విజన్‌లో భాగంగా మీడియో, కల్చర్ రంగాల్లో ఇంటెలిజెంట్ పరిష్కారాల అవసరాన్ని హైలైట్ చేసినట్టు తెలిపారు. పైరసీకి వ్యతిరేకంగా మోదీ గారి గట్టి ఆలోచనలు మనకు ఎంతో ప్రేరణను ఇస్తున్నాయి. ప్రభుత్వ మద్దతుతో ఇండస్ట్రీకి నిజమైన రక్షణ సాధ్యమవుతుంది అని తేజ స్పష్టం చేశారు.

## ప్రజావాణితో సమస్యలు పరిష్కారం..

### -కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



ప్రజావాణిలో వచ్చే సమస్యలు పరిష్కరిస్తున్నామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ప్రజావాణి నిర్వహించి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చే అర్జీలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. పెండింగ్లో పెట్టవద్దని,మొత్తం 167 దరఖాస్తులు వచ్చాయని అన్నారు.ప్రజావాణిలో డీఆర్డీ ఓ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

## నిర్మాత రామారావు కన్నుమూత

**బలగం టీవి, హైదరాబాద్**



టాలీవుడ్‌కు చెందిన ప్రముఖ నిర్మాత జవాజి వెంకట రామారావు (68) (అలియాస్ తేనెటీగ రామారావు) ఆదివారం హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. గత కొన్నాళ్లుగా ఆయన కాలేయ సంబంధిత సమస్యతో బాధ పడుతున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. 1990లో నరేష్, రాజేంద్రప్రసాద్ తదితర కథానా యకులతో ఆయన ఎక్కువగా సినిమాలు తీశారు. రాజేంద్రప్రసాద్‌తో తేనెటీగ సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న ఆయనను అదే పేరుతో పిలుస్తారు. వంశీ దర్శకత్వంలో నరేష్–వాణీవిశ్వనాథ్‌లతో ప్రేమ అండ్ కో, శివకృష్ణతో బొబ్బిలి వేట, బడి వంటి సినిమాలను నిర్మించారు. కొన్ని డబ్బింగ్ చిత్రాలను కూడా ఆయన తెలుగులో విడుదల చేశారు. రామారావు మృతిచెందిన విషయాన్ని తెలుసుకున్న పలువురు సినీ రంగ ప్రముఖులు తీవ్ర సంతాపాన్ని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## జూలై 4న నితిన్ "తమ్ముడు" విడుదల

**బలగం టీవి, హైదరాబాద్**

ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణంలో నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో రూపొందుతున్న ప్రెస్టీజియస్ మూవీ "తమ్ముడు". ఈ చిత్రంలో లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు పోషిస్తున్నారు. దర్శకుడు శ్రీరామ్ వేణు పుట్టిన రోజు సందర్భంగా "తమ్ముడు" మూవీ రిలీజ్ డేట్ ను అనౌన్స్ చేశారు. జూలై 4న ఈ సినిమాను రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు.